క్లుప్తంగా

ప్రజాపాలన విజయోత్సవాలను జయప్రదం చేయండి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: ప్రభుత్వం డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు చేపట్టనున్న ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పురపాలక శాఖ కమిషనర్, కలెక్టర్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అదేవిధంగా రూపొందిన ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలను నిర్వహించి, విజయవంతం అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై రోజువారీ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. సమావేశంలో మేనేజర్ అంజన్‌కుమార్, పర్యావరణాధికారి ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

మూగ జీవాలను రక్షించుకోవాలి

మండల పశువైద్యాధికారి స్రవంతి



గొర్రెలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్: వ్యాధుల నుంచి మూగజీవాలను రక్షించుకోవాలని మండల పశువైద్యాధికారి స్రవంతి అన్నారు. శనివారం మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామాల్లో పారుడు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జీవాలకు ఎటువంటి రోగాలు ప్రబలిన వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొందుర్గు: రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ చాటాలని ఎంఈఓ గాయత్రి అన్నారు. మండలంలోని ముట్పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన శృతి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. శనివారం నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు మంచిర్యాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన విద్యార్థి శృతిని శనివారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 177, ఆన్ హౌస్ సర్వే నెంబర్ 49 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికుల సమాచారం మేరకు మండల రెవెన్యూ సిబ్బంది వీటిని జేసీబీతో కూల్చివేశారు. మండల ఆర్‌ఐ అచిత్‌రెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేతలు నిర్వహించారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించామని ఆర్‌ఐ తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

సీఐ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పట్టణ సీఐ విజయకుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీనియర్ కబడ్డీ జూనియర్ కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, రమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, అనిల్, సతీశ్, మాధవి, రామ్మూర్తి, నితిన్, రీనా, మాధురి, శ్రీదర్, సంధ్యారాణి, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- రైతు పండుగకు తరలిన నాయకులు, రైతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు పండుగకు శనివారం షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నదాతలు దేశానికి వెన్నుముక అని, రైతుల అభివృద్ధికి పాటుపడాల్సిన గత ప్రభుత్వం రైతులను మోసం చేసి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. తద్వారా ఎన్నికల్లో అన్నదాతలకు బీఆర్‌ఎస్ నేతలకు తగిన బుద్ధి చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేస్తుందని, గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ఎన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆహర్నిషలు శ్రమిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా రైతు పండుగను నిర్వహించి వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని తెలియజేసేందుకు స్టాళ్లను ఏర్పాటు చేసిందన్నారు. సభకు తరలివెళ్లిన వారిలో నాయకులు సులోచన, కృష్ణారెడ్డి, బాబర్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, రఘునాయక్ తదితరులు ఉన్నారు.

మొయినాబాద్ మండలం నుంచి..

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో రైతుల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం చలో మహబూబ్‌నగర్ రైతు పండుగ ప్రజావేదికకు బాకారం గ్రామం నుంచి దాదాపు 200 మందికిపైగా రైతులు భారీగా తరలివెళ్లారు. అదేవిధంగా వివిధ గ్రామాల నుంచి రైతులు అధికారుల సమక్షంలో తరలివెళ్లారు. బాకారం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి, మహేందర్‌ముదిరాజ్‌లు జెండా ఊపి బస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. రైతుల రుణమాఫీ వేదికగా నిర్వహించిన మహబూబ్‌నగర్ బూత్‌పూర్ మండల్ అమిస్తాపూర్‌లో జరిగిన రైతు పండుగ రాష్ట్ర రైతులకు ఎనలేని ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. రైతుకు పెట్టుబడి సహాయం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోలు, వరదలతో పంటల నష్టానికి ఆర్థికసాయం ఎన్నో విధాలుగా రైతులకు సంబంధించిన పథకాలు ప్రభుత్వం అమలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల రైతు కిసాన్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, చిన్నమంగళారం రాములు, మంగల్ శంకరయ్య, జి.పాపిరెడ్డి, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాకారంలో..

ఆర్థికాభివృద్ధికి కృషి

చేవెళ్ల: రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు పండుగ సదస్సుకు చేవెళ్ల డివిజన్‌ను నుంచి శనివారం బస్సుల్లో రైతులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. రైతు సదస్సుకు వెళ్తున్న బస్సులను తహసీల్దార్ కృష్ణయ్య, వ్యవసాయాధికారులు, స్థానిక నాయకులు కలిసి ప్రారంభించి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల డివిజన్‌లోని ప్రతి గ్రామం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో రైతులను తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, స్థానిక నాయకులు, రైతులతో పాటు చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షుడు అలంపల్లి వీరేందర్‌రెడ్డి, తదితరులు వెళ్లినట్లు చెప్పారు.

5 బస్సుల్లో..

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు పండుగకు మండలం నుంచి రైతులు, మహిళలు తరలివెళ్లారు. మహిళా సమాఖ్య సహకారంతో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలం నుంచి 5 బస్సుల్లో రైతులు, మహిళలు వెళ్లారు.



చేవెళ్లలో బస్సును ప్రారంభిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య, అధికారులు, తదితరులు



కేశంపేట: బైర్కాన్‌పల్లి నుంచి రైతు పండుగకు వెళ్తున్న రైతులు

నాటుడెందుకు.. నరుకుడెందుకు!



చెట్లు, మొక్కలు తొలగించి స్థలాన్ని చదును చేయిస్తున్న అధికారులు

మోడల్ హౌస్ కోసం జేసీబీతో చెట్ల తొలగింపు

మొయినాబాద్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి.. చెట్లను పెంచాలని చెప్పే అధికారులే వనమహోత్సవంలో నాటిన చెట్లను తొలగించారు. మోడల్ హౌస్ నిర్మాణం కోసం అంటూ 5 నెలల క్రితం నాటిన మొక్కలతో పాటు నలభై సంవత్సరాల క్రితం నాటిన పెద్ద పెద్ద చెట్లను జేసీబీతో తొలగించారు. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మోడల్ హౌస్(ఇందిరమ్మ ఇళ్లు) నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకుగాను మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 400 గజాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. అయితే ఆ స్థలంలో ఐదు నెలల క్రితమే వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సుమారు 500 మొక్కలు నాటారు. గతంలో నలభై ఏళ్ల క్రితం నాటిన పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి. వాటిని శనివారం సాయంత్రం అధికారులు దగ్గరుండి జేసీబీతో తొలగించారు. వనమహోత్సవం పేరుతో అధికారులే మొక్కలు నాటించి.. ఆ మొక్కలతో పాటు పెద్ద పెద్ద చెట్లను సైతం తొలగించడం విడ్డూరంగా ఉందని చూసినవారంతా ముక్కునవేలేసుకుంటున్నారు.

పోరాట ఫలితంగానే వెనుకంజ

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: బీజేపీ పోరాట ఫలితంగానే లగచర్లలో ఫార్మా ఏర్పాటు విషయమై ప్రభుత్వం వెనుకంజ వేసిందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లగచర్లలో ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములను సేకరించి ఫార్మా సిటీని ఏర్పాటు చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. ఫార్మాసిటీ రద్దు కోసం ఎంపీ డీకే అరుణ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేసిందని, తద్వారా ప్రభుత్వం వెనక్కి తగ్గి నిర్ణయాన్ని ఉపసంహరించుకుందన్నారు. ప్రభుత్వం ఏ పరిశ్రమలు స్థాపించినా రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిన నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, చేగు సుధాకర్, శ్యాంసుందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సదుపాయాలు కల్పించాలి

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న శ్రీనివాస్

షాద్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీలకు కావాల్సిన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ అన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు సమావేశ మందిరం లేకపోవడంతో చెట్ల కిందనే సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. శనివారం ఈ విషయాన్ని తెలుసుకున్న దొడ్డి శ్రీనివాస్ అంగన్‌వాడీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు భవనం లేకపోవడంతో చెట్ల కిందనే కూర్చొని సమావేశాన్ని నిర్వహిస్తున్నారన్నారు. సమావేశాన్ని ఏర్పాటు చేసినప్పుడు నియోజకవర్గంలోని దాదాపు 300 నుంచి 400 మంది అంగన్‌వాడీ టీచర్లు హాజరవుతారని, వారందరికీ ఒకే మరుగుదొడ్డి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంపై తక్షణమే స్పందించి అంగన్‌వాడీ టీచర్లకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చేవెళ్ల: మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సీఎం కప్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఎల్.పురన్‌దాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాపాలనలో భాగంగా చేపడుతున్న సీఎం కప్ కార్యక్రమానికి సంబంధించి డిసెంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 'పునరుత్పాదక ఇంధన వనరులు' (రినవబుల్ ఎనర్జీ సోర్స్) అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయని చెప్పారు. మండలంలోని హైస్కూల్ విద్యార్థులు పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు. సకాలంలో విద్యార్థులు ఈ వ్యాసరచన పోటీల్లో పాల్గొనాలని కోరారు. వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో ప్రతిభ మెరుగుపడుతుందన్నారు.

స్కాలర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్‌టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థినులకు రానున్న ఇంటర్మీడియట్ కోసం ఎన్‌టీఆర్ విద్యాసంస్థల ద్వారా స్కాలర్‌షిప్ అందించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల డీన్ రామారావు అన్నారు. శనివారం ఈ సందర్భంగా విద్యాసంస్థలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం మాదిరిగానే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు ఈ నెల 8వ తేదీన స్కాలర్‌షిప్ కోసం రాతపరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. పదోతరగతి చదువుతున్న విద్యార్థినులు ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం కోసం ప్రతి నెలవారికి స్కాలర్‌షిప్ రూపంలో ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థినుల్లో మొదటి 10 ర్యాంకు విద్యార్థినిలను గుర్తించి రెండు సంవత్సరాలకుగాను ప్రతి నెల 5 వేల రూపాయలు, అదే విధంగా 2వ ర్యాంకు సాధించిన 15 మందిని గుర్తించి ప్రతి నెలకు 3 వేల రూపాయల చొప్పున ఆర్థికసహాయం అందిస్తామన్నారు. ఈ నెల 8న మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ సమీపంలోని గండిపేట ఎన్‌టీఆర్ కుటీరంలో రాత పరీక్ష ఉంటుందని 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మహాపడి పూజ

కేశంపేట: మండల కేంద్రమైన కేశంపేటలోని ఏఆర్‌కే బంకెట్ హాల్‌లో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ స్వాములు రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, ఆర్యన్‌రెడ్డి, యుగేంధర్, మహేశ్‌యాదవ్, మహేశ్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, చందు యాదవ్‌లు తెలిపారు. స్వాములతో పాటు భక్తులు పడిపూజలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందాలని కోరారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కేశంపేట: హరితహారం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కేశంపేటతో పాటు వివిధ గ్రామాల్లో నాటిన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి బీజేవైఎం నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. విషపూరితమైన కోనోకార్పస్ చెట్ల నుంచి వచ్చే గాలితో ప్రజలు దగ్గు, ఆయాసం, ఉబ్బసంతో పాటు శ్వాసకోశ సంబంధిత సమస్యలు వస్తున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. కోనోకార్పస్ చెట్ల వేర్లు భూమిలోకి వెళ్లడంతో భూగర్భ నీటి మట్టాలు తగ్గుతున్నాయని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి విషపూరితమైన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మల్లూంకార్ శివాజీ, శ్రీనివాస్, శివగౌడ్, మహేశ్, వినోద్, రాఘవేందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

సీనియర్ నాయకుడు యెన్నం శ్రీధర్‌రెడ్డి

కేశంపేట: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యం అవుతుందని సీనియర్ నాయకుడు యెన్నం శ్రీధర్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేసిందని ఆయన ఆరోపించారు. మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ చేశారని, ఇంటి నిర్మాణాలకు త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గ్రామ కమిటీలను ప్రకటిస్తుందని, దీంతో గ్రామాల్లో ఇళ్ల లేని అర్హులను గుర్తించి సొంత ఇళ్లను నిర్మిస్తామని ఆయన తెలిపారు. రైతులకు త్వరలోనే వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందిస్తామన్నారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, రూప్లానాయక్, పర్వతాలు, గ్యార సురేశ్, మనోహర్‌గౌడ్, నీల పాండు, విజయారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సురేశ్‌రెడ్డితో పాటు సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడి పూజ



మెట్లపై పడిని వెలిగిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి గురుస్వామి

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో శనివారం 18వ సారి మాల ధరించిన అల్లం శ్రీనివాస్‌రెడ్డి అయ్యప్పస్వామి 18వ మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాన్ని నర్కూడ ప్రాంతానికి చెందిన బుక్క కిట్టు గురుస్వామి పూజను చేపట్టారు. ఈ సందర్భంగా గణపతి హోమం, కుమారస్వామిపూజతో పాటు అయ్యప్పస్వామికి నూతన వస్త్రాలు, పూలు, పండ్లు నైవేద్యం సమర్పించారు. అయ్యప్ప విగ్రహానికి 18 రకాల అభిషేకాలను నిర్వహించి 18వ సారి మాల ధరించిన శ్రీనివాస్‌రెడ్డి తల్లిదండ్రులైన పెంటారెడ్డిసుశీలను పూజా ప్రాంగణంలో పాదాభిషేకం, పూలాభిషేకం నిర్వహించారు. అనంతరం భజన మండలి పాడిన పాటలు స్వాములందరినీ నృత్యాలు చేయించాయి. దీంతో గ్రామంలో అయ్యప్ప స్వామి నామ స్మరణతో మార్మోగింది. అనంతరం 18 మెట్లపై కర్పూర హారతి వెలిగించారు. కార్యక్రమంలో కుమ్మరి రాంచందర్ గురుస్వామి, అల్లం సుశీలపెంటారెడ్డి, అల్లం మోహన్‌రెడ్డి, అల్లం సుధాకర్‌రెడ్డి, స్వాములు నవీన్‌కుమార్, వీరేందర్‌రెడ్డి, శివకుమార్, సురేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప మాల ధరించిన స్వాములు, బంధుమిత్రులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం

ఎక్సైజ్ సీఐ శ్రీలత



కానిస్టేబుల్ జాకీర్ అలీ అభినందన సభలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

చేవెళ్ల: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎక్సైజ్ సీఐ శ్రీలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం వద్ద శనివారం ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎండీ జాకీర్ అలీ పదవీ విరమణ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదవీ విమరణ పొందిన కానిస్టేబుల్ ఎండీ జాకీర్ అలీకి అధికారులు, తోటి సిబ్బంది పదవీ విరమణ శుభాకాంక్షలు చెప్పారు. ఆయనను ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాల్గొన్న రాష్ట్ర ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ యూనియన్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, సీఐ శ్రీలతలు మాట్లాడుతూ.. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి తమ విధులు బాధ్యత నిర్వహించి అందరి మన్ననలు పొందాలన్నారు. జాకీర్ అలీ అందరితో కలిసిమెలసి పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ఇక పదవీ విరమణ అనంతరం కుటుంబసభ్యులతో కలిసి తన శేష జీవితం సంతోషంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయం ఎస్‌ఐలు ఎండీ ఖాజామొయినుద్దీన్, ఎన్. శ్రీనివాస్, ఆర్.వెంకటేశ్వర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యావ్యవస్థపై నిర్లక్ష్యం సరికాదు



చేవెళ్లలో పాఠశాలను బంద్ చేయించడంతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు



షాద్‌నగర్‌రూరల్: పాఠశాలలను బంద్ చేయిస్తున్న నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్

చేవెళ్ల: రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకుండా విద్యా వ్యవస్థను అస్తవ్యస్తంగా మారుస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.శ్రీనివాస్, బి.అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. గురుకుల, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. వరుసగా జరుగుతున్న సంఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగివచ్చి తక్షణమే చర్యలు చేపట్టాలని, రాష్ట్రంలో పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి చార్జీలను పెంచాలన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖపై సమీక్షలు చేసేందుకు, ఎప్పటికప్పుడూ సమస్యలను పరిష్కారం చేసేందుకు విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు విద్యారంగ సమస్యలపై స్పందించి పరిష్కరించాలన్నారు. లేదంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహాలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంలేదని ఆరోపించారు. విద్యార్థులకు అందించే భోజన విషయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.